సాక్షి నిర్మల్

సోమవారం : 29 : ఏప్రిల్ : 2024



'కోడ్' కష్టాలు..! 8లో▸

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్నారు. రూ.50వేలకు మించి తరలిస్తున్న నగదును పట్టుకుంటుండగా సామాన్యులే ఇబ్బంది పడుతున్నారు.



పంట కుప్పలతో ముప్పు 9లో▸

జిల్లాలో పలుచోట్ల రోడ్లపై వరి ధాన్యం ఆరబోస్తున్నారు. రోజుల తరబడి కుప్పలు పోసి ఉంచుతున్నారు. రాత్రివేళ పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /29.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. జిల్లాలో పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

1నుంచి సంస్కృతి వేసవి శిబిరం ప్రారంభం

నిర్మల్ రూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రమశిక్షణ సంస్కృతి సంప్రదాయాలు, సదాచారంపై శిక్షణ ఇచ్చేందుకు మే 1నుంచి 16వ తేదీ వరకు 'సంస్కృతి–వేసవి శిబిరం' నిర్వహించనున్నట్లు జిల్లా కేంద్రంలోని బాగులవాడలో గల శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ప్రధానాచార్యుడు కొండూరు నరేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒత్తిడిని జయించడం, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లకు బానిస కాకుండా సంస్కారం, సదాచారం, సంప్రదాయాలు, సూర్య నమస్కారాలు, యోగా, ధ్యానముద్ర, నీతి కథలు, భగవద్గీత, శ్లోకాలు, దేశభక్తి గీతాలు, అన్నమాచార్య కీర్తనలు నేర్పించనున్నట్లు వివరించారు. ఆర్ట్, క్రాఫ్ట్ కృత్యాలు, రామాయణ, మహాభారత వేదపఠనం తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షితులు, అనుభవజ్ఞులైన ఆచార్యుల ద్వారా ప్రతిరోజూ శిబిరం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 8–15 ఏళ్ల బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9704736340 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉద్యోగ ఉపాధి మేళా

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే భీమారావు తెలిపారు. జియో, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీల్లో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మార్కెటింగ్, ఉద్యోగాల భర్తీకి చేపట్టనున్న మేళాలో ఏదైనా డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసినవారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9నుంచి అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9963728452 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమేశ్వర్, సెక్రటరీగా అమ్ముల భూషణ్, ట్రెజరర్‌గా అక్షయ్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు సోమేశ్వర్ పేర్కొన్నారు.

నేడు బాక్సింగ్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, చందుల స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. 1 జనవరి 2006 నుంచి 31 డిసెంబర్ 2007 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మే 3నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లోని లాలాగూడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9966677105 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



జిల్లా కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్ రూరల్: ఉమ్మడి జిల్లాలోని గురుకులాల్లో ఇంటర్, డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,148 మంది విద్యార్థులకు 1,930 మంది హాజరయ్యారు. డిగ్రీలో ప్రవేశానికి 558 మంది విద్యార్థులకు 501 మంది హాజరు కాగా, 57 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో ప్రవేశం కోసం 1,590 మందికి 1,429మంది విద్యార్థులు హాజరు కాగా, 161మంది హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాలను డీసీవో మాద సంతోష్‌కుమార్, ఏసీజీ పద్మ పరిశీలించారు.

1నుంచి ఎన్నికల శిక్షణ తరగతులు ప్రారంభం

నిర్మల్ రూరల్: జిల్లాలోని ఉపాధ్యాయులకు మే 1నుంచి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణకు కేటాయించిన తేదీల సమాచారం అందించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గైర్హాజరైన వారిపై కలెక్టర్ అనుమతితో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయిపై సమరం



సిబ్బందితో కలిసి వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల (ఫైల్)

- ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు..
- జిల్లా వ్యాప్తంగా గుట్టుగా విక్రయాలు
- మత్తుతో చిత్తవుతున్న జిల్లా యువత
- ఎస్పీ పర్యవేక్షణలో నిత్యం తనిఖీలు
- పట్టుబడుతున్న గంజాయి, గుడుంబా
- సత్ఫలితాలిస్తున్న పోలీసుల చర్యలు



గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి (ఫైల్)

నిర్మల్ టౌన్: జిల్లాలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా దందా సాగిస్తున్నారు. దీంతో జిల్లా పోలీసులు గంజాయిపై యుద్ధం ప్రకటించారు. జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించారు. అటవీ ప్రాంతాల్లో కొందరు గుట్టుగా గంజాయి సాగు చేస్తుండగా గుర్తిస్తున్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేస్తున్నారు.

మత్తులో జోగుతున్న యువత

మారుమూల ప్రాంతాల్లో గంజాయి భూతం జడలు విప్పుతోంది. విద్యార్థుల జీవితాలను చిత్తు చేస్తోంది. మత్తుకు బానిసైన యువతను టార్గెట్ చేసుకున్న గంజాయి మాఫియా.. చివరకు వారినే ఏజెంట్లుగా మార్చుకుంది. చాపకింద నీరులా గంజాయి దందాను జిల్లా అంతటికీ విస్తరించింది. గంజాయి సేవిస్తున్నవారిలో ఎక్కువ శాతం మంది ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. టీబీ, క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులతో మంచానికే పరిమితమవుతున్నారు. చిన్న వయసులోనే వృద్ధులుగా కనిపించేవారు కొందరైతే.. మరికొందరు జీవచ్ఛవాల్లా కాలం వెల్లదీస్తున్నారు.

ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఫోకస్

గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు ఎస్పీ జానకి షర్మిల చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 54 బృందాలను ఏర్పాటు చేసి స్వయంగా తనిఖీల్లో పాల్గొంటున్నారు. భైంసా డివిజన్‌లో ఏఎస్పీ కాంతిలాల్, నిర్మల్ డివిజన్‌లో డీఎస్పీ గంగారెడ్డి తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. నగదు, మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లాలో ఖానాపూర్, ముథోల్, నిర్మల్ నియోజకవర్గాలున్నాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు రకాల నిఘా బృందాలను కేటాయించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ ఇతర శాఖలను ఇందులో భాగస్వాములను చేశారు. అడుగడుగునా తనిఖీలతో అక్రమదందాకు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై మరింత నిఘా పెంచారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర బలగాలతో ప్రజలకు అవగాహన పెంచేందుకు కవాతు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు..

ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 2.09 కిలోల గంజాయి, 2,508 లీటర్ల మద్యం, రూ.1,40,03,310 నగదు, 138 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో ఆరు గంజాయి కేసులు నమోదు కాగా, 19 మంది నిందితులు పట్టుబడ్డారు. నిర్మల్ పట్టణంలో 209 గ్రాముల గంజాయి, నిర్మల్ రూరల్ మండలంలో నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 15.09 లీటర్ల మద్యం, ఐదు లీటర్ల గుడుంబా, రూ.1.90లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. భైంసా పట్టణంలో 143 గ్రాముల గంజాయి, రూ.99వేల నగదు, భైంసా రూరల్‌లో 35.75 లీటర్ల మద్యం, రూ.8,937 నగదు, కుభీర్‌లో 10.56 లీటర్ల మద్యం, తానూర్‌లో 6.2లీటర్ల మద్యం, రూ.83వేల నగదు, సారంగపూర్‌లో 350 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. దిలావర్‌పూర్‌లో రూ.85వేల నగదు, నర్సాపూర్‌లో 10.5 లీటర్ల మద్యం, రూ.1.29లక్షల నగదు, సోన్‌లో 16.78 లీటర్ల మద్యం, 70 చీరెలు, లక్ష్మణచాందలో రూ.51వేల నగదు, మామడలో 10 లీటర్ల గుడుంబా, ఖానాపూర్‌లో 13.4 లీటర్ల మద్యం, పెంబిలో 15 లీటర్ల గుడుంబా, దస్తురాబాద్‌లో 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు.

పిల్లలను అనుక్షణం గమనించాలి



తల్లిదండ్రులు పిల్లలను అనుక్షణం గమనించాలి. గంజాయికి బానిస కాకుండా జాగ్రత్త వహించాలి. గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నాం. జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం సమీపంగా ఉండటంతో మత్తు పదార్థాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. జిల్లాలో ఎవరైనా గంజాయి సాగుచేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. వారికి పారితోషికం కూడా ఇస్తాం. గంజాయి విక్రయించినా, సాగుచేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

– జానకి షర్మిల, ఎస్పీ

మరో ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ డీ రాజారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కోర్బగల్లికి చెందిన మహ్మద్ బషీర్ శనివారం అదే ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్సై నారాయణ్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో అతడి నుంచి 186.310 గ్రాముల పొడి గంజాయి లభించినట్లు తెలిపారు. ఈ మేరకు గంజాయితోపాటు అతడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్బగల్లిలోని అతడి నివాసంలో తనిఖీలు చేపట్టగా, బషీర్ తల్లి మోసిన్ బేగం కూడా గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకొందని తెలిపారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్న నయాబాదికి చెందిన రిజ్వాన్, అక్బర్ పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని పట్టుకుంటామని సీఐ వెల్లడించారు.

తీర్పు విలక్షణం



- అన్ని పార్టీలకు ఆదరణ
- కాంగ్రెస్ అభ్యర్థులదే ఆధిపత్యం
- ప్రాంతీయ పార్టీలకూ దక్కిన విజయం
- కమ్యూనిస్టు నుంచి కాషాయం వరకు
- ఆదిలాబాద్ ఎంపీ స్థానం.. ప్రత్యేకం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్లు అన్ని రాజకీయ పార్టీలకు పట్టం కట్టారు. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులను గెలిపించి పార్లమెంట్‌కు పంపించారు. ఈ నియోజకవర్గం నుంచి అత్యధికంగా కాంగ్రెస్ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించగా ప్రాంతీయ పార్టీలకు కూడా ఓటర్లు అండగా నిలిచి ఆదరించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో విలక్షణమైన తీర్పునిచ్చిన ఓటర్లు గతానికి భిన్నంగా భారతీయ జనతా పార్టీకి జైకొట్టి ఆదివాసీ ఉద్యమ నాయకుడిగా ఉన్న సోయం బాపూరావును ఎంపీగా గెలిపించారు. తాజా ఎన్నికల్లో ఓటరు తీర్పు ఎలా ఉంటుందో ఆసక్తిగా మారింది.

ఇప్పటివరకు 18 సార్లు ఎన్నికలు..

హైదరాబాద్ రాష్ట్రంలో ఏర్పడిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం 2008 వరకు జనరల్ స్థానంగా కొనసాగింది. ఇప్పటివరకు ఈ నియోజకవర్గానికి ఒక ఉప ఎన్నికతో కలిపి మొత్తం 18 సార్లు ఎన్నికలు జరిగాయి. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ అభ్యర్థి చెరుకు మాధవరెడ్డిని ఎంపీగా గెలిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. 1957, 1962, 1967, 1971, 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు కే ఆశన్న, జీ నారాయణరెడ్డి, పీ గంగారెడ్డి, జీ నర్సింహారెడ్డిని ఎంపీలుగా గెలిపించి ప్రజలు హస్తం పార్టీకి అండగా నిలిచారు. వరుసగా ఆరు ఎన్నికల్లో ఆ పార్టీ హవానే కొనసాగింది.

కాంగ్రెస్ విజయానికి బ్రేక్..

టీడీపీ ఆవిర్భావం అనంతరం కాంగ్రెస్ విజయాలకు బ్రేక్ పడింది. 1984లో జరిగిన ఎన్నికల్లో తొలి ఎంపీగా గెలిచిన సీ మాధవరెడ్డి టీడీపీ తరఫున బరిలో నిలిచి మరోసారి విజయం సాధించారు. మరుసటి ఎన్నికలు 1989లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి పీ నర్సారెడ్డి గెలుపొందారు. 1991 నుంచి 1999 వరకు టీడీపీ హవా కొనసాగింది. ఆ పార్టీ తరఫున 1991 అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి విజయం సాధించగా, 1996, 1998, 1999 ఎన్నికల్లో సముద్రాల వేణుగోపాలాచారి హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసుకున్నారు.

2004లో గులాబీ పార్టీ గెలుపు..

ప్రత్యేక తెలంగాణ నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి 2004 ఎన్నికల్లో ఈ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసింది. తొలి ఎన్నికల్లోనే ఆ పార్టీ అభ్యర్థి టీ మధుసూదన్‌రెడ్డి హ్యాట్రిక్ విజయాల అభ్యర్థి వేణుగోపాలాచారిని ఓడించి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ తరఫున పార్లమెంట్‌లో తొలిసారి ఆదిలాబాద్ నుంచి తన వాణి వినిపించారు. ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారిన తర్వాత 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ విజయం సాధించగా, 2014లో మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తొలిసారి బరిలో నిలిచిన సోయం బాపూరావును గెలిపించి ఆ పార్టీ తరఫున తొలిసారి పార్లమెంట్‌కు పంపించారు. ఇలా కమ్యూనిస్టు నుంచి కాషాయం వరకు ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన ఆయా ప్రధాన, ప్రాంతీయ పార్టీలను గెలిపించారు. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ తరఫున ముగ్గురూ ఆదివాసీ అభ్యర్థులే బరిలో నిలిచారు. వీరిలో ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారో వేచి చూడాల్సిందే. వరుసగా రెండోసారి గెలిపించి ఆనవాయితీ పునరావృతం చేస్తారా.. లేక కొత్త అభ్యర్థిని గెలిపించి చరిత్ర సృష్టిస్తారా? అనే దానిపై రాజకీయవర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

బోనమెత్తిన పీచర



బోనాలతో శోభాయాత్రగా ఆలయానికి వస్తున్న మహిళలు



శోభాయాత్రలో శివసత్తుల విన్యాసం

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఇటీవల నిర్మించిన గ్రామ దేవతల ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. నెత్తిన బోనాలతో మహిళలు శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య నిర్వహించిన శోభాయాత్రలో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు సమీప గోదావరి నది నుంచి పవిత్ర జలాలు తెచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అడెల్లిలో భక్తుల సందడి



దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



ఆలయం ఎదుట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తజనసందోహంతో కిటకిటలాడింది. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇన్విజిలేషన్ విధులు



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

నిర్మల్ రూరల్: ఓపెన్ టెన్త్ పరీక్షల్లో ఇన్విజిలేషన్ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా విధులు కేటాయించారని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నాయక్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓపెన్ టెన్త్ బోధన సెంటర్లలో పనిచేస్తున్న ట్యూటర్లకు మాత్రమే ఇన్విజిలేషన్ విధులు కేటాయించాలని నిబంధనలో ఉన్నా జిల్లాలో ఇందుకు విరుద్ధంగా ఉపాధ్యాయులకు పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారని ఆరోపించారు. ఓపెన్ టెన్త్ విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు అరకొర గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. వారు వేసవి సెలవుల్లో పరీక్షల నిర్వహణ విధులకు హాజరైతే సంపాదిత సెలవులు మంజూరు చేయాలని నిబంధనలో ఉందని పేర్కొన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నిబంధనలకు విరుద్ధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు అక్రమ మార్గంలో డ్యూటీలు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఎనిమిది సెంటర్లున్నాయని కడెం, దస్తురాబాద్ మండలాల విద్యార్థులు జిల్లా కేంద్రానికి వచ్చి పరీక్షలు రాయడం దూరభారమవుతోందని తెలిపారు. వచ్చే సంవత్సరం ఈ పరీక్షలను ఖానాపూర్ కేంద్రంగా నిర్వహించాలని కోరారు. ఆయన వెంట కార్యవర్గ సభ్యులు భిక్షపతి నాయక్, క్రాంతికుమార్ తదితరులున్నారు.

ఆర్టీసీకి పెళ్లి కళ!



- ఏప్రిల్‌లో రూ.36.44 కోట్ల ఆదాయం
- రీజియన్ పరిధిలోనే నిర్మల్ టాప్

భైంసాటౌన్: అంతంత మాత్రం ఆదాయంతో నెట్టుకొస్తున్న ఆర్టీసీకి మంచి రోజులొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంతో సంస్థ ఖజానా గలగలలాడుతోంది. దీనికి తోడు పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో ఒక్క ఏప్రిల్‌లోనే రూ.కోట్లలో ఆదాయం చేకూరింది. గతంతో పోలిస్తే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దాదాపు అన్ని బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఓఆర్ శాతం 88కి పైనే నమోదవుతోంది. అయితే సరిపడా సర్వీసులు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సర్వీసులతోనే ఈ స్థాయిలో ఆదాయం వస్తుండగా, సర్వీసులు పెంచితే మరింత ఆదాయం సమకూరే అవకాశముంది.

రీజియన్‌లో నిర్మల్ టాప్

ఏటా సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉండడంతో ఆర్టీసీకి ఆదాయం గణనీయంగా ఉంటోంది. అయితే, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మరింత ఆదాయం పెరిగింది. గతంలో భైంసా ఆర్టీసీకి రోజుకు రూ.12 లక్షలు సరాసరి ఆదాయం సమకూరగా, ప్రస్తుతం రూ.15 లక్షలకు పెరిగింది. ఈనెల ఒకటో తేదీ నుంచి 27 వరకు రీజియన్ పరిధిలో రూ.36.44 కోట్ల ఆదాయం సమకూరింది. రీజియన్ పరిధిలోని అన్ని డిపోలతో పోలిస్తే నిర్మల్ డిపో అత్యధిక ఆదాయం రూ.9.45 కోట్లతో టాప్‌లో నిలిచింది. చిన్న డిపో అయిన ఉట్నూర్‌కు ఈనెలలో రూ.1.67 కోట్ల ఆదాయం సమకూరింది.

డిపోల వారీగా ఆదాయం ఇలా..

డిపో	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	7.56
ఆసిఫాబాద్	5.08
భైంసా	3.94
మంచిర్యాల	8.75
నిర్మల్	9.45
ఉట్నూర్	1.67

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా..

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. పెరిగిన రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. లక్షే లక్ష్యం పేరిట ఆదాయం పెంచేందుకు కొత్త కార్యక్రమం ప్రారంభించాం. పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

– సోలోమాన్, రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

అమ్మవారి ఉత్సవ మూర్తికి అభిషేకం



అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉత్సవ మూర్తికి అభిషేకం నిర్వహించారు. ప్రతీ మాసంలో జరిగే అమ్మవారి జన్మనక్షత్రం(మూలనక్షత్రం) పూజల్లో భాగంగా అభిషేకం, కలశపూజ, గణపతిపూజ, సరస్వతీపూజ, కుంకుమార్చన పూజలు వేదమంత్రోత్సరణల మధ్య ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

‘మత్తడివాగు’లో తగ్గిన నీటిమట్టం

తాంసి: ఎండల తీవ్రత పెరుగడంతో మండలంలోని వడ్డాడి శివారులోని మత్తడివాగు ప్రాజెక్టులో నీరు అడుగంటిపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాజెక్టులో నీరు రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 271.05 మీటర్లకు నీరు చేరింది. రాబోయే రోజుల్లో మరింత నీటిమట్టం తగ్గితే డెడ్‌స్టోరేజీకి చేరే అవకాశం ఉంది.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్రీకాంత్

నేరడిగొండ: మండల కేంద్రంలోని వరుణ్ మద్యం మార్ట్‌లో ఈ నెల 25న చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన మద్దుల రాజశేఖర్ మద్యానికి బానిసై ఈనెల 25న వరుణ్ మద్యం మార్ట్‌లో చోరీకి పాల్పడ్డాడు. రూ.14,600 నగదుతో పాటు మద్యం బాటిళ్లు తీసుకెళ్లాడు. సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా పోలీసులు నిందితుడిని గుర్తించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నగదు పట్టివేత

దండేపల్లి: మండలంలోని గూడెం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ టీం సభ్యులు, పోలీసులు శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో నగదు పట్టుకున్నారు. రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.1,30,500 నగదు లభించిందని, వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై లింగంపెల్లి భూమేష్ తెలి పారు. తనిఖీల్లో టీం ఇన్‌చార్జి విజయ్‌ప్రసాద్, ఏఎస్సై రాజేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘కోడ్’ కష్టాలు..!





ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్‌పూర్ వద్ద పట్టుబడిన నగదుతో ఫ్లైయింగ్ స్క్వాడ్ (ఫైల్)

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

- నగదు పరిమితితో సామాన్యులకు ఇబ్బందులు
- ఎన్నికల వేళ తప్పని తిప్పలు
- రూ.50వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపాల్సిందే
- నిర్లిప్తతతో ఉంటే పరేషానే..

నిర్మల్‌ఖిల్లా: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలు కొనసాగుతున్న వేళ చేతిలో రూ.50 వేలకు పైగా నగదుతో బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ముఖ్యంగా బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లాలన్నా, ఏవైనా వస్తువులు, నూతన వస్త్రాలు, వాహనాలు కొనాలన్నా నగదు తీసుకెళ్లడం పెద్ద సమస్యగా మారింది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తుండడంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. నగదు తీసుకొని పోవాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సివస్తోందని వాపోతున్నారు. దాదాపు నెల రోజుల క్రితం ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుండి కోడ్ అమలులో ఉంది. దీంతో పోలీసులు, ఎన్నికల తనిఖీ అధికారులు ప్రధాన ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరీ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు పట్టుబడుతున్న నగదుతో ఎన్నికలకు సంబంధం ఉండకపోవచ్చని తెలిసినా నియమావళి రీత్యా ఏం చేయలేకపోతున్నారు. దీంతో వ్యాపార మరియు ఇతర అవసరాలకు తీసుకెళ్తున్న నగదు పట్టుపడితే తలలు పట్టుకుంటున్నారు.

గత నవంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఖానాపూర్ నుండి నిర్మల్ వస్తున్న సందర్భంలో ఖానాపూర్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద రూ.3లక్షల నగదు లభించింది. సరైన ఆధారాలు లేకపోవడంతో జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సరైన ఆధారాలు చూపించిన పిదప ఆ డబ్బులు సదరు వ్యక్తికి అప్పగించారు. దాదాపు 20 రోజుల తర్వాత తన డబ్బు తన చేతికి అందింది. ఓ వివాహ ఖర్చుల నిమిత్తం తీసుకెళ్తున్న నగదుగా ఆధారాలు చూపడంతో సమస్య పరిష్కారం అయింది. ఇలా ఎన్నికలకు సంబంధం లేకుండా సామాన్య ప్రజలు నగదు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకుంటుండడం సామాన్య ప్రజానీకంలో ఆందోళన కలిగిస్తోంది.

తనిఖీల నిర్వహణతో అడ్డుకట్టపడుతోందా

ఎన్నికల కోడ్ మొదలైన నాటి నుంచి తాత్కాలిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు సంబంధించిన నగదు పెద్ద మొత్తంలో పట్టుబడిన దాఖలాలు లేవు. శాసనసభ ఎన్నికల సమయంలో కూడా చిరు వ్యాపారులు సామాన్య ప్రజలకు సంబంధించిన నగదు పట్టుకోవడం గమనార్హం.

ఎన్నికల కోసం తరలిస్తున్న నగదు కంటే సామాన్యుల దగ్గర పట్టుబడుతున్న ఘటనలే ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ రోజుల్లో రూ.50 వేలకు పైబడి నగదు తీసుకెళ్లడం సర్వసాధారణమైపోయిందని, ఏ వస్తువు కొనాలన్నా రూ.లక్షలలో ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో వివాహాలు, ఇతర శుభకార్యాలు, భవన నిర్మాణాలు, స్థిర, చరాస్తుల కొనుగోళ్లు, అమ్మకాలు కూడా ఉంటుండడంతో అవసరం రీత్యా నగదును వెంట తీసుకెళ్లడం సహజమేనని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడిన డబ్బు ఏం చేస్తారంటే?

రూ.50 వేల నుండి 10 లక్షల వరకు పట్టుబడిన నగదును జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో జమ చేస్తారు. రూ.10 లక్షలకు మించి దొరికితే మాత్రం ఆదాయపన్ను శాఖ నోడల్ అధికారికి సమాచారం అందిస్తారు. పట్టుబడిన నగదును వారికి అప్పగిస్తారు. అక్కడి నుండి నగదు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్తుంది. సరైన ఆధారాలు చూపిన తర్వాత తిరిగి పొందవచ్చు. తక్కువ మొత్తంలో పట్టుబడిన డబ్బును మాత్రం జిల్లా స్థాయి ఎన్నికల అధికారి పర్యవేక్షణలో సరైన ఆధారాలు పరిశీలించి తిరిగి అప్పగిస్తారు.

అశ్రద్ధ, నిర్లక్ష్యం అసలే వద్దు..

- రోజువారీగా జేబులో కనీసం రూ.50 వేలకు మించి డబ్బు ఉంచుకోవడం సర్వసాధారణమే అయినా నగదుకు సంబంధించిన సరైన ఆధారాలను వెంట ఉంచుకోవడం ఉత్తమం.
- ఏ అవసరం కోసం నగదును తీసుకెళ్తున్నామని విషయం సూటిగా తనకి అధికారులకు వెల్లడించాలి. వాటికి సంబంధించిన సరైన పత్రాలను చూపించాలి.
- నగదు వెంట ఉన్నప్పుడు భయపడినా సరైన సమాచారం ఆధారాలు చూపకుండా పోలీసులకు తనిఖీ అధికారులకు అనుమానం వచ్చినా నగదును జప్తు చేసే అవకాశం ఉంటుంది.
- హాస్పిటల్ చికిత్స, శుభకార్యాలకు సంబంధించి సామగ్రి, బట్టలు, తదితర వ్యాపార సంబంధిత బిల్లు చెల్లించడానికి తీసుకెళ్తుంటే వాటికి సంబంధించిన రశీదులు వెంట ఉంచుకోవాలి.

నిధులు తేవాలి... సమస్యలు తీర్చాలి

- ఎంపీ ఎలా ఉండాలనే దానిపై యువత మనోగతం

బోథ్: ఒక గ్రామం లేదా మండలం లేదా జిల్లా అభివృద్ధి చెందాలంటే మంచి నాయకులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలి. గ్రామ సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, పార్లమెంట్ సభ్యుల వరకు ఎవరైతే అభివృద్ధి చేయగలుగుతారని నమ్ముతారో వారినే ఎన్నికల్లో ఎన్నుకోవాలి. అయితేనే ఆయా గ్రామాల్లో అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. అభివృద్ధికి కావాల్సింది నిధులు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టాల్సి ఉంటుంది. గ్రామంలో నెలకొన్న సమస్యలను తీర్చాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తమకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తమను గెలిపిస్తే ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులు ఎలా ఉండాలనే దానిపై పలువురు యువకులు ‘సాక్షి’కి తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ కోసం నామినేషన్ వేసిన అభ్యర్థులు

ఆత్రం సుగుణ (కాంగ్రెస్), ఆత్రం సక్కు (బీఆర్ఎస్), గోడం నగేష్(బీజేపీ), మాలోత్ శ్యాంలాల్‌నాయక్(అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్), రాథోడ్ సుభాష్ (ఇండిపెండెంట్), మేస్రం గంగాదేవి (డీఎస్పీ), గెడం సాగర్(ఇండియా ప్రజాబంధు పార్టీ), కోడప వామన్‌రావ్(గోండ్వానా దండకారణ్య పార్టీ), భుక్య జైవంత్ రావు(ఇండిపెండెంట్), సునావత్ తిరుపతి (విద్యార్థుల రాజకీయ పార్టీ), రాథోడ్ రాజు (ఇండిపెండెంట్), చవాన్ సుదర్శన్(అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), మేస్రం జంగుబాపు(బీఎస్పీ)

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు
ఆదిలాబాద్	2,43,535
బోథ్	2,10,915
నిర్మల్	2,56,417
ముధోల్	2,53,604
ఖానాపూర్	2,23,966
ఆసిఫాబాద్	2,26,582
సిర్పూర్	2,28,855

స్థానిక సమస్యలు తెలిసుండాలి



పార్లమెంట్ పరిధిలో సమస్యలపై అవగాహన ఉండాలి. మండలాల వారీగా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి తీర్చగలగాలి. అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. సమస్యలను గుర్తించి, వాటిని తీర్చగలిగే వారినే గెలిపించాలి.

– బండారి రోహిత్, సొనాల

నిధులు తెస్తేనే అభివృద్ధి



గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిధులు అవసరం. నిధులు తీసుకువచ్చే వారినే గెలిపించాలి. అయితేనే అభివృద్ధి పనులు జరుగుతాయి. నిధులు తీసుకురాని వారిని గెలిపిస్తే వ్యర్థమే. ఓటర్లు ఆలోచించి అభివృద్ధి చేయగలిగే వారిని ఎన్నుకోవాలి.

– పులిశెట్టి వినయ్, పిప్రి

ప్రజల్లో ఉండే వారే ఎంపీగా ఉండాలి



నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకునే వారే ఎంపీగా ఉండాలి. ఎన్నికల ముందు ఓట్లకోసం వచ్చి అమలు కాని హామీలు గుప్పించే నాయకులు గెలిస్తే అభివృద్ధి జరగదు. ప్రజల్లో ఉండే అభ్యర్థిని ఎంపీగా గెలిపిస్తే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయి.

– కందుల అఖిలేష్, బోథ్

ప్రజల గొంతుకగా ఉండాలి



పార్లమెంట్‌లో సమస్యలను లేవనెత్తే వారినే ఎంపీగా గెలిపించాలి. ఇక్కడి ప్రజల గొంతుకగా ఉండి, ప్రభుత్వానికి సమస్యలను తెలియజేయాలి. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రజల గొంతుకగా ఉండే అభ్యర్థిని ఎన్నుకోవాలి. అయితేనే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

– ఓస మణికంఠ, బోథ్

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం ఉద్యోగాలు లేక యువత తీవ్ర నిరాశలో ఉన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకమైన కారిడార్ ఏర్పాటు చేసి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చూడాలి. పరిశ్రమల ఏర్పాటు వల్ల యువతకు ఉపాధి దొరుకుతుంది. యువతకు ఉపాధి కల్పించే ప్రభుత్వం రావాలి.

– ఉదయ్, బోథ్

మోదీని మరోసారి ప్రధానిని చేయాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మోదీని మరోసారి ప్రధానిని చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మావల మండలంలోని బట్టిసావర్గాం, దుబ్బగూడ, మావల మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం చేపట్టిన పథకాలను వివరించారు. అనంతరం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని న్యూ రాంపూర్‌లో జరిగిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సోదరి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గల్ఫ్ కార్మికులకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన కార్మికులు, ఉద్యోగులకు ప్రభుత్వాలు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరముందని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతను ప్రాథమిక హక్కుగా గుర్తించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా ఏప్రిల్ 28న గల్ఫ్ దేశాలలో మరణించిన బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కాంగ్రెస్ స్టేట్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, నాయకులు రాజన్న, అట్ల పోతరెడ్డి, సందీప్‌రావు, యస్ఎన్ రెడ్డి, సాయిరాజ్, డేవిడ్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి’



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నేరడిగొండ: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీమన్న కాలనీ, న్యూ హనుమాన్ కాలనీ, మహరాజుల కాలనీ, పాత హనుమాన్ కాలనీల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి జరగాలంటే ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని పేర్కొన్నారు. మరోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, ప్రధాన కార్యదర్శి రాఘవులు, నాయకులు తిత్రే నారాయణ సింగ్, గాదె శంకర్, జాదవ్ పరశురాం, సరసాని మహేందర్ రెడ్డి, కమల్ సింగ్, భూమేష్, నరేందర్, శ్రీను, గంగాధర్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని ఒకరి మృతి

నందిపేట్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన ధర్మపురి సూర్యకిరణ్ (32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యకిరణ్ ఆదివారం ఉదయం తన అత్తగారి ఊరైన నందిపేట మండలంలోని తల్వేదకు వచ్చాడు. సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో నందిపేట మండలం సీహెచ్ కొండూర్ శివారులో రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను ఢీకొని కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భైంసాకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

తల్లిని వేధిస్తున్నాడని తండ్రిని కడతేర్చిన తనయుడు



ఎల్లయ్య (ఫైల్)



పోలీసుల అదుపులో నిందితుడు

సోన్: తల్లిని వేధిస్తున్నాడని తండ్రిని కుమారుడు కడతేర్చిన ఘటన నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని మాదాపూర్‌లో చోటు చేసుకుంది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి నడిపి ఎల్లయ్య (58) నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య చిన్నక్కను కొట్టేవాడు. తండ్రి ప్రవర్తన పెద్ద కుమారుడు సాయిలుకు నచ్చేది కాదు. పలుమార్లు నచ్చజెప్పినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. దీంతో ఎలాగైనా తన తండ్రిని మట్టుపెట్టాలని అనుకుని ఇంట్లో ముందస్తుగా కర్రను దాచి ఉంచాడు. శనివారం రాత్రి ఎప్పటిలాగే మద్యం సేవించి ఇంటికి వచ్చిన తండ్రి తన తల్లితో గొడవపడడంతో సాయిలు ఇంట్లో దాచి ఉంచిన కర్ర, బండరాయితో విచక్షణా రహితంగా కొట్టాడు. వెంటనే మృతుని బంధువులు 100కు డయల్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రున్ని నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి సూచన మేరకు సోన్ సీఐ, ఎస్సై నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

సారంగపూర్‌లో నేపాల్‌వాసి మృతి



ఫారెస్ట్ కార్యాలయం వెనుక మృతదేహం

సారంగపూర్: మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం వెనుక టేకుచెట్ల నీడన ఆదివారం నేపాల్ దేశానికి చెందిన బీర్బాన్ రోకయా (70) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మృతుడు స్థానికంగా పలుదాబాల్లో పనిచేసేవాడు. వయసు పైబడడంతో పనులు దొరకక యాచిస్తూ జీవనం గడిపేవాడు. ఈక్రమంలో సారంగాపూర్‌లోనూ యాచన చేస్తూ ఫారెస్ట్ కార్యాలయం వద్ద రాత్రిపూట నిద్రిస్తుండేవాడు. ఇదే క్రమంలో ఆదివారం ఆయన కదలలేకుండా పడిపోయి ఉన్న విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు స్థానిక వైద్యాధికారులకు సమాచారం అందించడంతో సదరు వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదర్శం.. ఆదివాసీ వివాహం

- రూ.50 వేల ఖర్చుతో పెళ్లి చేసిన కుటుంబం
- బైక్‌పై మండపానికి పెళ్లికూతురు
- బ్యాండ్‌మేళాలకు బదులు సంప్రదాయ డోలు



బైక్‌పై మండపానికి వస్తున్న పెళ్లి కూతురు

తాంసి: భీంపూర్ మండలంలోని మార్కగూడలో ఓ ఆదివాసీ కుటుంబం ఎలాంటి ఆర్భాటాలు లేకుండా వివాహం జరిపించి ఆదర్శంగా నిలిచింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాణిక్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్త మీరాబాయి తమ కుమారుడి వివాహాన్ని ఇంటి వద్ద ఎలాంటి ఆడంబరాలు లేకుండా జరిపించారు. ఆదివారం మార్కగూడలో విద్యావంతులైన అంకుష్, మనీషాల వివాహాన్ని గిరిజన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. బంధువులకు సహపంక్తి భోజనం వడ్డించారు. ఫొటోగ్రఫీ, బ్యాండ్‌మేళాకు బదులు సంప్రదాయ డోలు, భోజనంలో సైతం అన్నం, పప్పు, ఒక కర్రీ, స్వీట్‌తోనే సరిపెట్టారు. రూ.50వేల ఖర్చుతో పెళ్లి జరిపించారు. కాగా పెళ్లి కూతుర్ని కల్యాణ మండపానికి ద్విచక్రవాహనంపై తీసుకువచ్చారు. వరుడు ఎలాంటి కట్నకానుకలు తీసుకోకుండా వివాహం చేసుకోవడంతో ఈ జంట ఆదర్శంగా నిలుస్తోంది.



వరుని ఇంటివద్ద వివాహ వేడుక

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి

లక్సెట్టిపేట: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన పడిలాల్ దాస్ కొమ్రె (31) ఐదురోజుల క్రితం మరో నలుగురు మిత్రులతో కలిసి మండలంలోని కొత్తూరుకు వలస వచ్చి మామిడికాయల మండిలో పనిచేస్తున్నారు. ఒక్కరోజు మాత్రమే పనిచేసి నేను ఇంటికి వెళ్తానని పడిలాల్ దాస్ స్నేహితులతో చెప్పి వెళ్లిపోయాడు. ఆదివారం కొత్తూరు గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తరచూ మద్యం సేవించేవాడని, మద్యం మత్తులో బావిలో పడిపోయి ఉంటాడని మిగతా స్నేహితులు తెలిపారు. మృతుని బావమరిది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారులో రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. స్థానిక కాలేజీరోడ్‌కు చెందిన పొట్యాల సాయికిషోర్ (35) తండ్రి ఏడాదిక్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కీర్తన, కుమారుడు ఉన్నారు.